క్లుప్తంగా

పంచారామ క్షేత్రం భక్తులకు ఉచిత వసతి

ఈఓ బళ్ల నీలకంఠం



భక్తులు వేచి ఉండటానికి కల్యాణ మండపాన్ని పరిశీలించిన ఈఓ, సిబ్బంది

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రానికి వచ్చే భక్తులకు వేచి ఉండే అవకాశం కల్పిస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. పట్టణానికి దూరంగా గోదావరి కాలువ ఆవలి వైపు పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయం ఉంది. దాంతో సుదీర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు విశ్రాంతి తీసుకోవడానికి అవకాశం లేదు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆలయాన్ని మూసి వేస్తారు. ఆ సమయంలో భక్తులకు దర్శనం ఉండదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎండలో నిరీక్షించాల్సి పరిస్థితి ఉండడంతో అక్కడికి సమీపంలోని మాండవ్యనారాయణ స్వామి ఆలయం సమీపంలో ఉన్న కల్యాణ మండపంలో భక్తులు వేచి ఉండేలా ఏర్పాట్లు చేశారు. భక్తులు ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని ఈఓ వివరించారు. అలాగే ఆలయంలో నిత్యం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని భక్తులు దానిని స్వీకరించాలని ఆయన కోరారు. వివరాలకు ఆలయ సెల్ నెంబరు 79893 89266ను సంప్రదించాలన్నారు.

ప్రతి విద్యార్థీ ప్రతిభను కనబరచాలి

జిల్లా విద్యా శాఖాధికారి రమేష్



టోఫెల్ పరీక్షా విధానాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రమేష్

పెద్దాపురం: ప్రతీ విద్యార్థీ తమలో దాగివున్న ప్రతిభను కనపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న టోఫెల్ పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షా విధానం తీరుపై ఆరా తీశారు. ఆయన వెంట ఎంఈఓ ప్రభాకర శర్మ, హెచ్ఎం బాపూజీ, సీఆర్పీ ప్రకాష్ తదితరులున్నారు.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన



బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేస్తున్న ఆలయ పండితులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

గొల్లప్రోలు: చేబ్రోలులోని మల్లవరం సెంటర్లో గల రామాలయం వద్ద శుక్రవారం సీతా రాముల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు శంకర శాస్త్రి, గోపి శర్మ మూడు రోజుల పాటు హోమాలు, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం పండితులు శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత పార్టీ నాయకులతో కలసి సీతారాములను దర్శించుకున్నారు. పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పుప్పాల బాబులు, ఓరుగంటి కృష్ణార్జున్, రాయుడు సాయిబాబు, యలమంచిలి గంగారావు, ఓరుగంటి రాజా పాల్గొన్నారు.

తుని నుంచి భద్రాచలానికి బస్సు సర్వీసులు

తుని: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాది రాముని కల్యాణోత్సవాలకు వెళ్లే భక్తుల కోసం తుని నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. తుని నుంచి బయలుదేరు బస్సులకు రిజర్వేషన్ సదుపాయం కలదన్నారు. తుని పరిసర ప్రాంతాలభక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వివరాలకు 73829 13216, 73829 21904 నంబర్లను సంప్రదించాలన్నారు.

జగనన్న వెంటే జనం

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- కొండెవరంలో ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే దొరబాబు ఎన్నికల ప్రచారం
- పాల్గొన్న కాపు ఉద్యమ నేత ,పార్టీ నాయకుడు ముద్రగడ పద్మనాభం



కొండెవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గీత, ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి/పిఠాపురం: రాష్ట్ర ప్రజలందరూ జగనన్న వెంటే ఉన్నారని వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతా అన్నారు. మండలంలోని కొండెవరంలో కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ పద్మనాభంతో కలిసి శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించి ఓట్లు అభ్యర్థించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మీ బిడ్డల భవిష్యత్‌కు బంగారు బాట వేయాలన్నా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంచి జరగాలన్నా మళ్లీ వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలన్నారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ఏపీని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మళ్లీ వైఎస్సార్ సీపీకి పట్టం కడతాయన్నారు. ఎంపీ అభ్యర్థి సునీల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటివరకూ వలంటీర్ వ్యవస్థపై తప్పుడు ప్రచారం, అసత్య ఆరోపణలు చేసిన చంద్రబాబు ఇప్పుడు వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఘన విజయం సాధిస్తుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో వంగా గీత విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీలు మాదిరెడ్డి దొరబాబు, చెట్టుబత్తిన నాని, మాకినీడి శేషకుమారి, పార్టీ నాయకులు మేడిశెట్టి శ్రీరాములు, వెంగళి సుబ్బారావు, గాది గంగబాబు, చెలికాని హరినాడ్, ఇంటి బాబ్జి, గాలి బాబ్జి, గాలి సత్యం, వాసంశెట్టి సూరిపండు, వేమగిరి నాని, అనీల్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం



మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరించి ఓట్లు అభ్యర్థిస్తున్న వంగా గీత



కొండెవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గీత, ఎమ్మెల్యే దొరబాబు

జల్లూరులో వంగా గీత ప్రచారం

పిఠాపురం: మండలం జల్లూరులో శుక్రవారం వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు జవ్వాది నాయుడు, సర్పంచ్ జుత్తుల మాధవి, తమ్మల బాబు, జుత్తుల రాజు, దెయ్యాల కాంతామణి, బుర్ర బాబ్జి, వీరబాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పి.రాయవరంలో వంగా గీతకు బ్రహ్మరథం



పి.రాయవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత తదితరులు

పిఠాపురం: మండలంలోని పి.రాయవరంలో గురువారం రాత్రి వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతకు జనం బ్రహ్మరథం పట్టారు. గ్రామ సర్పంచ్ మాదేపల్లి పార్వతి ఆధ్వర్యంలో సొసైటీ ప్రెసిడెంట్ మాదేపల్లి బాబూరావు వందలాది మందితో ఆమెకు స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఇప్పటివరకు ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు సింహాచలం, నాని తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో మెరిసిన కుసుమాలు



కె.లక్ష్మీసుధాశ్రీ



జి.సత్యసౌజన్య



టి.లక్ష్మీశ్రీ



లోడా రాజీ



జె.సాయిజ్యోతి



వి.సాయి మణికంఠ



సానా దేవి

- ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ
- నియోజకవర్గ టాపర్లుగా నిలిచిన వైనం

పిఠాపురం: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల విశేష ప్రతిభ కనబర్చారు. శుక్రవారం ప్రభుత్వం ఇంటర్ ఫలితాలను విడుదల చేసింది. నియోజకవర్గంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని కాపుగంటి లక్ష్మీ సుధాశ్రీ ప్రథమ సంవత్సరం సీఐ గ్రూపులో 500 మార్కులకు 491 మార్కులు సాధించి నియోజకవర్గ టాపర్‌గా నిలిచింది. సెకండియర్ సీఈటీలో గాజుల సత్య సౌజన్య 1000 మార్కులకు 955 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. తోట లక్ష్మీశ్రీ ఫస్టియర్ ఎంపీసీలో 470కి 389, సెకండియర్ బైపీసీలో లోడా రాజీ 1000కి 916 మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఇంటర్ ఫస్టియర్‌లో 41 శాతం, సెకండియర్‌లో 58.9 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు తెలిపారు.

గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

గొల్లప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్‌లో 50 శాతం, రెండో ఏడాదిలో 63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సాధనాల శాంతి రాజశ్రీ తెలిపారు. కళాశాల విద్యార్థిని జ్యోతుల సాయిజ్యోతి ఫస్టియర్ ఎంపీసీలో 470 మార్కులకు గాను 461 మార్కులు సాధించి నియోజకవర్గ టాపర్‌గా నిలిచింది. సెకండియర్ ఎంపీసీలో వెన్నా సాయి మణికంఠ 1000 మార్కులకు 953, సానా దేవి 952 మార్కులు సాధించారు. ఫస్టియర్ సీఈసీలో జయలక్ష్మి 500 మార్కులకు గాను 451 మార్కులు సాధించింది.

ఒకేషనల్‌లో 68 శాతం ఉతీర్ణత

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 72 మంది పరీక్ష రాయగా 49 మంది 68 శాతంతో ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ లీలా శ్రీదేవి తెలిపారు. సీఎస్ఈలో 18 మందికి 13, ఈటీలో 8 మందికి ఇద్దరు, ఎంఅండ్ఏటీలో ఐదుగురికి ఒక్కరు, సీజీటీలో 8 మందికి ఆరుగురు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 33 మందికి 27 మంది ఉత్తీర్ణుల య్యారని తెలిపారు. అలాగే ద్వితీయ సంవత్సరం సాధారణ గ్రూప్‌లో 58.5 శాతంతో ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఎంపీసీలో 19 మందికి ఏడుగురు, బైపీసీలో 12 మందికి ఏడుగురు, సీఈసీలో 16 మందికి 11 మంది, హెచ్ఈసీలో 18 మందికి 13 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో సాధారణ సబెక్టులో 96 మందికి 36 మంది ఒకేషనల్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్‌లో 127 మందికి 76 మంది ఉత్తీర్ణుల య్యారని ఆమె తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ

కొత్తపల్లి: ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల్లో మండలంలోని మూలపేట జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపీసీలో 19 మంది పరీక్షలకు హాజరు కాగా ఏడుగురు (37 శాతం) ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీలో 36 మంది పరీక్షలకు హాజరు కాగా 18 మంది (50శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు.

స్థానికుడిని.. ఆశీర్వదించండి



27వ వార్డులో ప్రచారం చేస్తున్న దవులూరి దొరబాబు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు
- 27వ వార్డులో ఇంటింట ప్రచారం

సామర్లకోట: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నుంచి స్థానికుడినైన తాను ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తనను ఆశీర్వదించాలని దవులూరి దొరబాబు ఓట్లు అభ్యర్థించారు. శుక్రవారం స్థానిక 27వ వార్డులో గణపతినగరం వాటర్ ట్యాంకుల నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, పార్టీ నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఆధ్యాత్మిక వేత్త, జీవీకె మోహనరావు స్వాగతం మేరకు ఆయన స్వగృహంలోని కనకదుర్గ మందిరంలో అమ్మవారిని దర్శించుకున్నారు. 40 ఏళ్లుగా నియోజకవర్గంలో స్థానికేతరులు ఎమ్మెల్యేగా పని చేశారని, జగన్‌మోహన్‌రెడ్డి స్థానికునిగా తనకు పోటీ చేసే అవకాశం ఇచ్చారని, తనకు ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, తద్వారా జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి సీఎంగా చేసుకోవాలని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలుకు రుణం తీర్చుకునే అవకాశం ప్రజలకు ఓటు ద్వారా వచ్చిందన్నారు. ఎంపీ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్ పోటీ చేస్తున్నారని ఆయన విజయం సాధిస్తే కాకినాడకు పరిశ్రమలు తీసుకువచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, కౌన్సిలర్లు కరణం రాజ్‌కుమార్, చల్లపల్లి వెంకటసత్యనారాయణ, సేపెని సురేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో ప్రచారం చేస్తున్న దవులూరి సతీమణి చంద్రకళ

మీలో ఒకడైన దవులూరిని గెలిపించండి

- ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు భార్య చంద్రకళ
- 27వ వార్డులో చురుగ్గా ఎన్నికల ప్రచారం

పెద్దాపురం: మీలో ఒకరు, నిత్యం మీతో ఉండే మీ అందరి వాడైన తన భర్తకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ కోరారు. పట్టణంలో 27వ వార్డులో ఆమె అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీ రాజేశ్వరి, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, పార్టీ మహిళా కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తెరిగి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ఆమె పేర్కొన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో దఫా వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. స్థానిక సమస్యలపై పూర్తి అవగాహన ఉందని నియోజకవర్గ ప్రజలు ఆదరించి స్థానికుడైన దొరబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు గెలిపించాలని ఆమె కోరారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తం

- ఈఆర్వో జేఎస్ రామారావు
- సిబ్బందికి శిక్షణ తరగతులు



పీఓ, ఏపీఓల శిక్షణా సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది పూర్తి స్థాయిలో పని చేయాల్సిందేనని ఈఆర్వో జేఎస్ రామారావు ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పోలింగ్, ఇతర అధికారులకు శుక్రవారం పోలింగ్ సరళి, ఈవీఎంల పనితీరుపై రెండు విడతలుగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నిబంధనలకు లోబడి సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలని ఆర్డీఓ ఆదేశించారు. ఓటు వేసే విధానంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈవీఎంలు ట్యాపరింగ్ గురవుతున్నాయన్న అపోహలు తొలగిపోవాలంటే వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వీవీ ప్యాట్, ఓటరు వెరిఫికేషన్ పేపరు, అడిట్ ట్రైలర్‌పై పూర్తి సమాచారాన్ని తెలియజేయాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియపై సిబ్బంది పూర్తి స్థాయి శిక్షణ పొందాలని, సందేహాలు నివృత్తి చేసుకోవాలని ఆయన అన్నారు. అనంతరం ఈవీఎంల పనితీరు, పోలింగ్ ప్రక్రియ ఏర్పాటు, పోలింగ్ అధికారుల విధులు, ఓటింగ్ కంపార్టుమెంటు, బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆర్డీవో కార్యాలయ ఏవో సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పెద్దాపురం, సామర్లకోట తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ పద్మజ, భానుకుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సాగు వ్యయం నియంత్రణ

- రైతులకు ఉపకరిస్తున్న కోత యంత్రాలు
- సబ్సిడీతో అన్నదాతకు ఆసరా
- ఎకరానికి రూ.10వేల వరకు ఆదా



ధాన్యాన్ని ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న వరి కోత యంత్రం

సామర్లకోట: రైతులు యాంత్రీకరణ పద్ధతికి అలవాటు పడడం ద్వారా ఖర్చులు తగ్గించు కొంటున్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా కేంద్ర పథకం ద్వారా సబ్సిడీపై వరి కోత యంత్రాలను రైతులకు అందజేస్తోంది. దాంతో ప్రతి గ్రామంలో వరి కోత యంత్రాలు అందుబాటులోనికి వచ్చాయి. ఈ మేరకు రైతులకు ఎకరానికి సుమారు రూ.10 వేల వరకు ఆదా అవుతోంది. కూలీలతో వరి కోత చేయడానికి ఎకరానికి పది మంది కావలసి ఉంటుంది. వారికి రూ.ఏడు వేలు చెల్లించాలి. అలాగే పనలు కట్టడానికి, కుప్ప వేయడానికి రూ.ఏడు వేలు, నూర్పిడికి మరో రూ.ఏడు వేలు ఖర్చు అవుతుందని రైతులు తెలియజేస్తున్నారు. కూలీలతో కోతలు జరిగిన సమయంలో గడ్డి పశువులకు పని చేసుందని రైతులు తెలియజేస్తున్నారు. ఎకరంలోని గడ్డి రూ.ఆరు వేలు చేస్తుందన్నారు. వరి కోత యంత్రంతో గంటన్నరలో ఎకరంలోని పంట చేతికి వస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గంటకు రూ.2,800 చొప్పున ఎకరానికి రూ.4,200 ఖర్చు అవుతుందని చెప్పుతున్నారు. దాంతో వరి కోత యంత్రంతో పంట కోత జరిగిన సమయంలో ఎకరానికి రూ.10 వేల వరకు ఆదా అవుతుందని రైతులు వివరించారు. దీనికి తోడు సమయం ఆదా, వెంటనే పంట చేతికి వస్తుందని తెలియజేస్తున్నారు.

ప్రభుత్వం సబ్సిడీ

వ్యవసాయ రంగంలో కూలీల కొరత పెరగడంతో యంత్రీకరణపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం వరి కోత యంత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటున్న రైతులకు సబ్సిడీపై వాటిని అందజేస్తోంది. దీనిలో భాగంగా గత ఏడాది మండల పరిధిలో ఐదు వరి కోత యంత్రాలను, యంత్రానికి రూ.8.8 లక్షలు సబ్సిడీతో అందజేశారు. దాంతో ప్రతి గ్రామంలో వరి కోత యంత్రాలు అందుబాటులోనికి వచ్చాయి. రైతుల వద్ద ఉన్న వరి కోత యంత్రాలను ఇతర ప్రాంతాలలోని రైతుల అవసరాలను తీర్చడానికి తరలి స్తున్నారు. మండల పరిధిలో 22,500 ఎకరాలలో వరి పంట వేయగా ప్రస్తుతం 20 శాతం కోతలు పూర్తి చేశారు.

రైతులకు అక్కరకు వస్తున్న ప్రభుత్వం



రైతులు యాంత్రీకరణకు అలవాటు పడడంతో సబ్సిడీపై వరి కోత యంత్రాలను అందజేస్తున్నారు. దీనిలో భాగంగా గత ఏడాది రూ.8.8 లక్షల సబ్సిడీతో వరి కోత యంత్రాన్ని తీసుకున్నారు. రూ.12.5 లక్షలు చెల్లించగా మిగిలిన మొత్తం బ్యాంకు రుణంగా ఇచ్చింది. దాళ్వా సీజన్‌లో సుమారు 40 రోజుల పాటు వరి కోత యంత్రానికి పని లభిస్తుంది. దాంతో బ్యాంకు రుణం వాయిదా చెల్లిస్తున్నాం. అన్ సీజన్‌లో యంత్రం సర్వీసు చేసి కోతలకు సిద్ధంగా ఉంచుతున్నాం.

– వెలమర్తి శ్రీనివాసరావు, వరి కోత యంత్రం యజమాని, వీకే రాయపురం

సబ్సిడీపై వరి కోత యంత్రాలు



సబ్సిడీపై వరి కోత యంత్రాలు కావలసిన వారికి ప్రభుత్వం యంత్రాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉంది. ఐదుగురు రైతులు ఒక సంఘంగా ఏర్పడి బ్యాంకులో ఖాతా తెరిచి కనీసం రూ.12.5 లక్షలు తమ వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం రూ.8.8 లక్షలు సబ్సిడీగా ఇస్తుంది. కంపెనీని బట్టిన మెషీన్లు రూ.25 లక్షల నుంచి 30 లక్షల వరకు ఉన్నాయి. దాన్ని బట్టి రైతుల వాటా ధనం మారుతుంది. మండలంలో ఐదు, పెద్దాపురంలో ఒకటి వరి కోత యంత్రాలను సబ్సిడీపై అందజేశాం. వరి కోతకు యంత్రాల కొరత లేదు. మండలంలో సొంతంగా రైతులకు 30 యంత్రాలు ఉన్నాయి. ప్రస్తుత దాళ్వాలో 90 శాతం యంత్రాలపై కోతలు జరుగుతాయి. 10 శాతం విత్తనాల కోసం, గడ్డికి ప్రాధాన్యం ఇచ్చే రైతులు మనుషులతో కోతలు చేయిస్తారు.

– ఐ సత్య, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

కొనసాగుతున్న వసంత నవరాత్ర పూజలు



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామివారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో శుక్రవారం నాలుగో రోజు వసంత నవరాత్ర పూజలు కొనసాగించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రారంభమైన వసంత నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం విఘ్నేశ్వర పూజ, మహన్యాసం, కుమారా రామభీమేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు, బాలాత్రిపుర సుందరి దేవికి నవావరణార్చన, నీరాజన మంత్రపుష్పాలు, కుంకుమార్చన, దర్బారు సేవ, వేదస్వస్తి నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.